క్లుప్తంగా

ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలి

ఆదోని రూరల్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించకుండా కడపలోనే కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, పట్టణాధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, పి.ఎస్.గోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు టర్నింగ్ వద్ద ఉన్న ఏపీజీబీ బ్యాంకు బ్రాంచ్ ముందు నిరసన తెలియజేశారు.

పిల్లలను బడికి పంపించండి



వలస వెళ్తున్న వారిని విచారిస్తున్న ఎంఈఓ-2 శోభారాణి

కోసిగి: వలస వెళ్లవద్దని పిల్లలను బడికి పంపించాలని ఎంఈఓ-2 శోభారాణి సూచించారు. బుధవారం కోసిగి మీదుగా టెంపోలలో వలస వెళ్తున్న కూలీలను ఆపి బడికి వెళ్లే పిల్లలను విచారించారు. ఇక్కడ సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేశామని, పిల్లలను ఇక్కడే వదిలేసి వెళ్లాలని సూచించారు. అయినా పిల్లలకు ఇక్కడ ఒంటరిగా ఉండలేరని కూలీలు తెల్పి చెప్పారు. వలసతో మీ పిల్లలను తీసుకెళ్లి జీవితాలు నాశనం చేయవద్దని, వారు కూడా మీతో పాటు కూలీలుగా మారుతారని ఎంఈఓ నచ్చజెప్పేయత్నం చేశారు. అయినా వినకుండా ఇక్కడ ఉంటే పనులు అప్పులు పెరిగిపోతాయని, గుంటూరుకు వెళ్లి అక్కడ మిరప పనులు చేసుకుని నాలుగు డబ్బులు వెనుకేసుకుంటామని చెప్పి కూలీలు వెళ్లి పోయారు.

గడ్డివామి దగ్ధం

కోసిగి: మండల పరిధిలోని దొడ్డి గ్రామంలో గద్దం దేవేంద్రకు చెందిన గడ్డివామి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బుధవారం మధ్యాహ్నం ఉన్నట్లుండి గడ్డివాము నుంచి మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేక పూర్తిగా కాలిపోయింది. పశువుల మేత కోసం ఇటీవల కొనుగోలు చేసిన నిల్వ చేసుకున్నట్లు బాధితుడు తెలిపారు. పశుగ్రాసం కోల్పోవడంతో పశువులకు మేతలేకుండా పోయిందని, ప్రభుత్వం పశుగ్రాసం అందించి ఆదుకోవాలని కోరారు.

వైన్ షాపును తొలగించండి

ఆదోని టౌన్: పట్టణంలోని కొత్త బస్టాండు రోడ్డులోని సుంకులమ్మ దేవాలయం పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన న్యూదీప్తి వైన్ షాపును తొలగించాలని బుధవారం ఎక్సైజ్ సీఐ సైదులుకు డీవైఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందించారు. డీవైఎఫ్ఐ పట్టణాధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నాగరాజు, వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు కృష్ణమూర్తి, మోహన్ తదితరులు సంతకాల సేకరణ చేపట్టిన వినతి పత్రాన్ని ఎక్సైజ్ సీఐకు అందించారు. నాయకులు మాట్లాడుతూ వైన్ షాపుకు సమీపంలో దేవాలయం, మసీదు, స్కూలు ఉందన్నారు. దీంతో అక్కడి కాలనీవాసులు, భక్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు నాగరాజు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పరీక్షలు తప్పనిసరి



తిమ్మాపురంలో సర్వేను పరిశీలిస్తున్న నోడల్ అధికారి డాక్టర్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: 30 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని తద్వారా ప్రాథమిక స్థాయిలోనే వ్యాధి నిర్ధారించి చికిత్సలు తీసుకోవచ్చని సంచార చికిత్స కార్యక్రమం నోడల్ అధికారి డాక్టర్ రఘు తెలిపారు. బుధవారం తిమ్మాపురం గ్రామంలో అసంక్రమిత వ్యాధుల సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మానవ జీవన విధానంలో మారుతున్న ఆరోగ్య అలవాట్లతో నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ తదితర వ్యాధులు అధికంగా వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు మహేష్‌ప్రసాద్, సామాజిక ఆరోగ్య అధికారి చంద్రకళ, ప్రాజెక్ట్ ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: ఆర్టీసీ డిపోలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు రాముడు, సురేష్, కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం డిపో ఆవరణలో మేనేజర్ మద్దిలేటినాయుడుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో డిపో కార్మికులు బీఎస్ రాజు, ఎండీ హనీఫ్, రసూల్, ఈరన్న, మాబ్బాష తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపాలిటీలో వివిధ విభాగాల్లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మగురుడు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారెడ్డి, విజయేంద్ర, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు యల్లప్ప, శివకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ వరప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఘనంగా చత్రపతి శివాజీ జయంతి

- శివాజీకి ఘన నివాళి
- వైభవంగా శోభాయాత్ర
- అన్నదానాలు, సేవా కార్యక్రమాలు

ఆదోని అర్బన్: ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదోని పట్టణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్ర జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఉత్సవకమిటీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, యువత పాల్గొని ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ట్రాక్టర్లలో విగ్రహాన్ని కూర్చోబెట్టి శోభాయాత్ర ప్రారంభించారు. ఆలయం నుంచి ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ట్రాక్టర్‌ను నడుపుకుంటూ శోభాయాత్రలో ముందుకుసాగారు. ఫారెస్ట్ లైన్ అంబాభవానీ దేవాలయం నుంచి ప్రధాన రహదారులగుండా షరాఫ్‌బజార్, పాత బస్టాండు మీదుగా ఏరియా ఆసుపత్రి వరకు శోభాయాత్ర జరిగింది. శోభాయాత్ర సందర్భంగా ఆదోని డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. శోభాయాత్రకు అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరాం పాల్గొని బందోబస్తును పర్యవేక్షించారు.



సిద్ధరూఢ శాంతాశ్రమంలో శివాజీ విగ్రహానికి హారతులు ఇస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు

సిద్ధరూఢ శాంతాశ్రమంలో..

కోసిగి: మండల కేంద్రం కోసిగి రైల్వే గేటు సమీపంలోని సిద్ధరూఢ శాంతాశ్రమంలో ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక ఆశ్రమంలో అర్చకులు వీరేష్ స్వామి ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి అభిషేకాలు, ఫల, పుష్పాలంకరణలు గావించి పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాయంత్రం ఛత్రపతి వివాజీ విగ్రహాన్ని కలశాలు, మేళతాళాలతో పురవీధుల గుండా శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, మహంతేష్ స్వామి, బుళ్లి నరసింహులు, ముకుంద కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఆదోని శోభాయాత్రలో పాల్గొన్న యువత

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో త్రయంభకేశ్వర ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సంఘం, గ్రామపెద్దలు శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు మారుతీమోహన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అక్కమతోట రామకృష్ణ, గ్రామ పెద్దలు ప్రహల్లదచారి, సుబ్బారాజు, వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.



శోభాయత్రలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఉన్న ట్రాక్టర్‌ను నడుపుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

వృద్ధులకు దుస్తుల పంపిణీ



వృద్ధులకు వస్త్రాలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలను బుధవారం పలు సంఘాలు ఘనంగా నిర్వహించాయి. ఇందులో భాగంగా స్థానిక హెచ్‌బీఎస్ కాలనీలో పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమంలో సొసైటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు నిర్వాహకులతో కలిసి వృద్ధులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. మానవ హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కామలే గణేష్, ఎల్లప్ప, ఆశ్రమ నిర్వాహకులు సింగనేటి నరసన్న, ప్రతిభా భారతి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

నందవరం : మండల కేంద్రంలోని నందవరంలో శ్రీవీర మణికంఠ స్వామి దేవాలయంలో ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని కార్యనిర్వాహకులు బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కార్యనిర్వహకులు భూపాల్‌గౌడ్, గురుస్వామి, అయ్యప్పస్వామి, భక్త బృందం సభ్యులు ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని శివ స్వాములకు, గ్రామస్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు.



నందవరంలోని మణికంఠ స్వామి ఆలయం అన్నదానం చేస్తున్న దృశ్యం

రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి



అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని రూరల్: ఎటువంటి లోటుపాట్లు లేకుండా రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. మండలంలో రీ సర్వే పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నికైన పెసలబండ గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను బుధవారం పరిశీలించారు. రీ సర్వే, రెవెన్యూకు సంబంధించిన అంశాలపై గ్రామ సచివాలయ కార్యాలయంలో సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి సమీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, మండల సర్వేయర్ ఈశ్వర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

భూమిపై విచారణ చేపట్టాలని వినతి

ఆదోని రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదోని బైపాస్ రోడ్డు కోసం కల్లుబావి పరిధిలోని సర్వేనంబర్ 414లో ఉన్న 1.41 ఎకరాల భూమిపై విచారణ చేపట్టాలని మానవహక్కుల వేదిక(హెచ్ఆర్ఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు యూజీ శ్రీనివాసులు కోరారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ సర్వేనంబర్ 414కింద ఉన్న భూమి ఎంత, ఆ భూమిని హంపీ విరూపాక్షేశ్వర దేవస్థానం నుంచి గంగన్న కొని టీఎం మస్తాన్‌కు అమ్మేశాడన్నారు. అతను ప్లాట్స్ వేసి విక్రయించగా కొన్న బాధితులు ఆందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హంపీ దేవస్థానం, ఏపీ రాష్ట్ర దేవదాయశాఖ అధికారులు గతంలోనే దీనికి సంబంధించి ఎన్‌ఓసీ ఇచ్చినప్పటికీ ఆదోని రెవెన్యూ అధికారులు తమకు నష్టపరిహారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. వెంటనే దీనిపై విచారణ చేపట్టాలని సబ్‌కలెక్టర్‌ను కోరారు. స్పందించిన సబ్‌కలెక్టర్ విచారిస్తామని హామీ ఇచ్చారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మంత్రాలయం : సైబర్ నేరాల పై అప్రమత్తంగా ఉండాలని సీఐ రామాంజులు సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోన్ యాప్ మోసాల పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యాశకు పోయి మోసపోవద్దని తెలిపారు. తెలియని లింక్‌లపై క్లిక్ చేయవద్దని, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి

కౌతాళం: విద్యార్థులు చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సీఐ అశోక్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రతిభ హైస్కూల్‌లో యూటీజింగ్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. పాఠశాల సెక్రటరీ సయ్యద్ మైనూద్దీన్, హెచ్ఎం జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు జయలక్ష్మి, భీమేష్, రాజులు పాల్గొన్నారు.



మంత్రాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రామాంజులు

నందవరం : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. బుధవారం స్థానిక జెడ్పీ పాఠశాల, కేజీబీవీ పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో 'నేను సైబర్ మార్' కార్యక్రమం నిర్వహించి, విద్యార్థినీ, విద్యార్థులకు సైబర్ నేరాలపై వీడియోల ద్వారా అవగాహన కల్పించారు.

వైభవంగా అమ్మవార్ల దేవర

ఆదోని రూరల్: మండలంలోని పాండవగల్ గ్రామంలో వెలిసిన దేవమ్మ, బంగారమ్మ, సుంకులమ్మ దేవతల దేవర మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవర మహోత్సవం ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించడం ఆనవాయితీ. గ్రామస్తులు ఆలయాలకు చేరుకుని కుంభాలను అమ్మవార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పెద్దతుంబళం ఎస్ఐ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు.




కుంభాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వెళ్తున్న మహిళలు

వైభవంగా దేవర

కౌతాళం: మండల పరిధిలోని మదిర గ్రామంలో దేవర మహోత్సవం వైభవంగా జరిగింది. బుధవారం తెల్లవారు జామున 2 గంటలకు మేటి కుంభానికి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అంతకుముందు దేవాలయాల్లో ఆకుపూజ, కుంకుమార్చన, ప్రత్యేక పూజలతో ఉత్సవాన్ని ప్రారంభించారు. దీంతో భక్తులు కుంభాలతో తరలివచ్చి మారెమ్మఅవ్వ, సుంకులమ్మ దేవి దేవాలయాల్లో పూజాలు నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలి రావడంతో గ్రామంలో అన్ని ప్రధాన విదులు జనంతో కిటకిటలాడాయి.

కంటి అద్దాల పంపిణీ

ఆదోని సెంట్రల్: పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అంధత్వ నివారణ సంస్థ వారు కళ్ల అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు. జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ జిల్లాలో గతేడాది ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు 201 పాఠశాలలో కంటి పరీక్షలను నిర్వహించడం జరిగిందన్నారు. అందులో 1,26,412 మంది విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించగా అందులో 3,700 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వారందరికి కంటి అద్దాలు పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పురపాలక పాఠశాలలో దృష్టిలోపం కలిగిన 160 మంది పిల్లలకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పురపాలక చైర్మన్ శాంతి, కమిషనర్ కృష్ణ, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓలు శాంతికళ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.




కళ్ల అద్దాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ధోబీఘాట్‌లో సదుపాయాలు కల్పిస్తాం

ఆదోని అర్బన్: పట్టణంలోని దోబీ ఘాట్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం ఆదోనిలోని రాంజల దగ్గర ఉన్న ఉన్న ధోబీఘాట్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రజక కుల వృత్తి చెందిన వారందరినీ అభివృద్ధిలోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ధీబిఘాట్‌లో ఇప్పటికే అవసరమైన నీటిని అందిస్తున్నామన్నారు. ఇస్త్రీ చేసుకునే వారికి కూడా మంచి ఇస్త్రీ పెట్టెలను అందిజేస్తామన్నారు. రజక కార్పొరేషన్ చైర్మన్ శ్రీమతి సావిత్రి, రజక కుల సంఘం నాయకలు పాల్గొన్నారు.

నకిలీ పట్టాలతో మోసం



డీఎస్పీ ఉపేంద్రబాబుకు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు నరసింహులు

మంత్రాలయం : పెద్దకడబూరు మండల కేంద్రానికి చెందిన కమ్మరి పరమేష్ అనే వ్యక్తి నకిలీ పట్టాల ఇచ్చి మోసం చేశాడని బాధితుడు నరసింహులు వాపోయాడు. బుధవారం పెద్దకడబూరు పోలీస్ స్టేషన్‌కు తనిఖీ నిమిత్తం వచ్చిన ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబును కలిసి మోసం చేసిన పరమేష్ పై చర్యలు తీసుకోవాలని కోరాడు. నరసింహులు మాట్లాడుతూ.. 10 సెంట్ల స్థలం ఇప్పిస్తానని ఇందుకు సర్వే నెంబర్ 377లో గతేడాది నవంబర్ నెలలో నాలుగు పట్టాలు ఇచ్చాడని చెప్పాడు. ఇందుకు గానూ తనవద్ద నుంచి రూ.2.80లక్షలు డబ్బులు తీసుకున్నాడని, ఆ స్థలంపై తహసీల్దార్‌ను విచారించగా అక్కడ చెరువు ఉంది, ఎలాంటి భూమి లేదని అన్నీ నకిలీ పట్టాలను తేల్చి చెప్పారని వాపోయాడు. ఈ విషయం పై పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐను కలిసి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపించాడు. తద్వారా విచారణ చేసి నాకు న్యాయం చేయాలని కోరాడు.

పొలంలో విద్యుత్ స్తంభాలు వేశారు..

ఆదోని రూరల్: మండలంలోని కపటి గ్రామంలో అనుమతి లేకుండా తమ పొలంలో విద్యుత్ స్తంభాలను వేశారని భూ యజమాని దక్షిణామూర్తి విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. ఆయన మాట్లాడుతూ.. కపటి గ్రామ సర్పంచ్ కీర్తన భర్త ప్రశాంత్‌ను కలిసి సమస్యను విన్నవించగా.. విషయం తమ పరిధిలో లేదని ఆయన బదులిచ్చారని చెప్పాడు. దీంతో లైన్‌మెన్ వీరేంద్రను వెళ్లి కలవగా, మా ఇష్టమొచ్చిన చోట స్తంభాలను ఏర్పాటు చేసాం, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అని దురుసుగా మాట్లాడుతున్నాడని వాపోయాడు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, జిల్లా విద్యుత్‌శాఖ అధికారికి ఫిర్యాదు చేస్తానని తెలిపాడు.

చిరుత పులుల కలకలం !

ఆదోని సెంట్రల్: ఆదోని మండలం పెసలబండ గ్రామం పులిగట్టు కొండల్లో రెండు చిరుత పులులు సంచరిస్తున్నట్లు వాట్సప్ గ్రూపుల్లో బుధవారం ఓ వీడియో వైరల్ అయ్యింది. చుట్టుపక్కల పొలాల పనులకు వెళ్లిన వారు కూడా గ్రామంలో చెప్పడంతో ఇరుగు పొరుగు వారు ఈ విషయంపై చర్చించుకుంటున్నారు. ఈ విషయం ఫారెస్ట్ రేంజ్ అధికారి తేజస్వినిని సంప్రదించగా.. చిరుతపులి సంచారంపై ఇంత వరకు తమకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు. వదంతులను నమ్మవద్దని, ఎవరూ కూడా భయపడాల్సిన పనిలేదన్నారు. పులుల సంచారం ఉన్న ప్రాంతాల్లో నైట్ బీట్ నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. పులులు సంచారం చేస్తున్నట్లు ఎవరికైన తెలిస్తే తమకు సమాచారం అందిస్తే, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కోసిగి: మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామంలో గోవిందప్ప తాత మఠం వెనుక పేకాట ఆడుతున్న పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు కోసిగి ఎస్ఐ చంద్రమోహన్ బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి గ్రామంలో 12 మంది పేకాట ఆడుతుండగా దాడులు చేసినట్లు చెప్పారు. ఇందులో గ్రామానికి చెందిన వీరేష్, సీతరాముడు, లక్ష్మప్ప, ఉసేని, ఉరుకుంద అనే వ్యక్తులు పట్టుబడగా మరో ఏడుగురు వ్యక్తులు పరారైనట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.19,200 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

బడ్జెట్‌లో సామాన్యులకు అన్యాయం

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఒరిగిందేమి లేదని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, నాయకులు సమీవుల్లా, కేసీ జబ్బార్ ఆరోపించారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక సోమప్ప సర్కిల్ ధర్నా చేసి కేంద్ర బడ్జెట్‌పై నిరసన తెలిపారు. అన్యాయంపై రాజకీయాలకు అతీతంగా కేంద్రంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దాదావలి, తిమ్మగురుడు, విజయేంద్ర, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల : స్థానిక బస్టాండ్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. సీపీఎం కార్యదర్శి కరుణాకర్, సీఐటీయూ నాయకుడు నబి రసూల్, నాయకులు బాషా, రంగస్వామి, హనుమన్న, బడేసా తదితరులు పాల్గొన్నారు.

నందవరం: కేంద్ర ప్రభుత్వం రైతులు, వ్యవసాయాన్ని విస్మరించి బడ్జెట్ ప్రవేశపెట్టిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడ్, మండల కార్యదర్శి గిడ్డయ్య ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో వామపక్షాల పిలుపు మేరకు బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఆ సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి శాంతప్ప, ముని, తిమ్మప్ప, ఉరుకుంద, తాయప్ప పాల్గొన్నారు.